క్లుప్తంగా

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు విందు



పామర్రు: స్థానిక ఏఎస్ఎం హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థులు పదో తరగతి విద్యార్థులకు వీడ్కోల్ విందు కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు బహుమతులుగా అందజేసి, పరీక్షలు బాగారాసి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండాలన్నారు.

జోరుగా మినుము పంట నూర్పిళ్లు



పామర్రు: మండలంలో మినుము పంట నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. మండలంలో 23,500 ఎకరాల్లో మినుము పైరు సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకూ సుమారు 15 వేల ఎకరాలకు పైగా నూర్పిళ్లు పూర్తి కావచ్చాయి. ఎకరానికి 5–7 బస్తాల వరకు దిగుబడులు వస్తున్నాయని రైతులు తెలిపారు. మినుముకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంతో రైతులు ఉత్సాహంగా పంట నూర్పిళ్లను పూర్తి చేస్తున్నారు.

శివాలయానికి వాటర్‌కూలర్ అందజేత



తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి ఆలయానికి దాతలు వాటర్‌కూలర్ బహూకరించారు. గ్రామానికి చెందిన తోట వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం కుమారుడు తోట శ్రీనివాసరావు రూ. 9 వేల విలువైన వాటర్‌కూలర్‌ను ఆలయ ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావుకు శనివారం అందజేశారు. గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి, తోట చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కిడ్నీ వైద్యులు డాక్టర్ సందీప్‌కు సత్కారం



గుడివాడ టౌన్: ఎన్టీఆర్ స్టేడియం సేవా కార్యక్రమాలలో భాగంగా పట్టణంలోని శంకరరావు కిడ్నీ హాస్పిటల్‌కు చెందిన ప్రముఖ కిడ్నీ వైద్యులు డాక్టర్ సందీప్‌ను శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఎం.శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కిడ్నీ నిపుణులను సత్కరించాలని క్లబ్ తీర్మానించిందన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కె. రామారావు, కోశాధికారి రామకృష్ణ, సభ్యులు సత్యనారాయణ, రామకృష్ణ, బ్రహ్మజీ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీలు ఐక్యతతో ముందుకు సాగాలి



కైకలూరు: ఎస్సీలు ఐక్యతతో ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బొద్దు నోబుల్ అన్నారు. స్థానిక సీఏఆన్నార్ గార్డెన్‌లో నియోజకవర్గ దళిత ఆత్మీయ సమావేశం శనివారం నిర్వహించారు. బైక్ ర్యాలీతో పెద్ద ఎత్తున యువతతో కలిసి ఆయన సభాస్థలికి వచ్చారు. అనంతరం నోబుల్ మాట్లాడుతూ కైకలూరు నియోజకవర్గంలో ఎస్సీ ఓటర్లు అధికంగా ఉన్నారని చెప్పారు. కైకలూరు నియోజకవర్గాన్ని ఎస్సీ రిజర్వేషన్‌గా ప్రకటించాలని కోరుతానన్నారు. దళితుల అభ్యున్నతికి అందరూ పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బండి ప్రసాద్, వీరాబత్తిన సుథ, జక్కుల విజయ్‌కుమార్ తేరా రమేష్, ఇస్సాకు, సాధు కొండయ్య, కృపారావు పాల్గొన్నారు.

ఆర్థికంగా ఎదిగితేనే సమసమాజ స్థాపన

పామర్రు ఎమ్మెల్యే అనిల్‌కుమార్



మొవ్వలో మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

మొవ్వ: మహిళలు ఆర్థికంగా ఎదిగితేనే రాష్ట్రంలో సమసమాజ స్థాపన సాధించవచ్చనే ధ్యేయంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో వైఎస్సార్ చేయూత, ఆసరా, అమ్మ ఒడిలాంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మొవ్వ గ్రామంలోని మండవ జానకరామయ్య కల్యాణ మండపంలో వైఎస్సార్ నాల్గో విడత వైఎస్సార్ చేయూత పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అలాగే గ్రామంలో జగనన్న కాలనీకి రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డుని, రూ.23.94 రైతు భరోసా కేంద్రం మొవ్వ–2 నూతన భవనాలను ఎమ్మెల్యే అనిల్‌కుమార్, ఎంపీపీ కొండేటి ఇందిర, జెడ్పీటీసీ సభ్యురాలు పార్వతితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకుని ఎన్నికల మానిఫెస్టోని ఏర్పాటు చేయటమే కాకుండా ఇచ్చిన హామీల్లో 99 శాతం పూర్తి చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు మనం గెలిపించుకోవాలన్నారు. మొవ్వ మండలంలో 4,189 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ నాల్గో విడత ద్వారా రూ.7,85,43,750 చెక్కును అందజేశారు. అలాగే గ్రామంలో 200 మందికి రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఇందులో భాగంగా మొవ్వ మండల మహిళలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కో–ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధరాజు, సర్పంచ్ తూము పూర్ణ చంద్రరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, సచివాలయ కన్వీనర్ ఆంజనేయులు, ఏపీఎం ప్రధాన రావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీని గెలిపించాలి

పమిడిముక్కల: సమసమాజ స్థాపన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన నాలుగో విడత వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సీఎం ఇప్పటివరకు 120 సార్లకు పైగా సంక్షేమ పథకాల బటన్లు నొక్కారని, రానున్న ఎన్నికల్లో రెండు బటన్‌లు ఫ్యాన్‌పై నొక్కి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు. గతంలో ఏ పనికావాలన్నా జన్మభూమి కమిటీల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, నేడు అర్హులకు సంక్షేమ పథకాలన్ని ఇంటి ముంగిటకే అందుతున్నాయన్నారు. వెలుగు ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ వైఎస్సార్ చేయూత నాలుగో విడత కింద 3,860 మంది లబ్ధిదారులకు రూ.7.24 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అబ్దుల్ మెహ బూబ్ సుభానీ, ఈఓఆర్డీ వెంకటేశ్వరరావు, ఎంపీపీ కాసాని వేద సుప్రజ, ఎంపీటీసీ సభ్యుడు వంశీ, వైస్ ఎంపీపీలు మహేష్, సీతారామయ్య, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ రాంబాబు పాల్గొన్నారు.



పమిడిముక్కలలో చేయూత చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

మహిళల ఆర్థికాభ్యున్నతే సీఎం ధ్యేయం

ముదినేపల్లి రూరల్: మహిళల ఆర్థికాభ్యున్నతే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి సునీల్‌కుమార్‌యాదవ్ అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో వైఎస్సార్ చేయూత పథకానికి సంబంధించి మండలంలోని మహిళలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి మహిళా తన కుటుంబాన్ని విద్య, ఆర్థిక, రాజకీయపరంగా ముందుకు తీసుకువెళ్లాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మహిళలను మోసగించేందుకు ప్రతిపక్షాలు కలిసికట్టుగా అబద్ధపు వాగ్దానాలు చేస్తాయని, వాటిని నమ్మకుండా జగనన్నకు మద్దతుగా నిలిచి వైఎస్సార్ సీపీని మళ్లీ అధికారంలోకి తేవాలని కోరారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.7.55 కోట్ల వైఎస్సార్ చేయుత నమూనా చెక్కును విడుదల చేశారు. మండలంలోని లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఏఎంసీల చైర్మన్లు చేబోయిన వీర్రాజు, కొల్లాటి సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు రాచూరి రాధా, చొప్పర్ల సునీత, వైఎస్సార్ సీపీ నాయకులు ఏసుబాబు, గుర్రాజు, అల్లాభక్షు, ఆదివిష్ణు, విష్ణువర్ధన్, శేషుబాబు, వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు సుశీల, సుగుణబాబు, రామకృష్ణ, జయలక్ష్మి, పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే జగనన్న ధ్యేయం

ముదినేపల్లి రూరల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగనన్న పాలన సాగిస్తున్నట్లు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ముదినేపల్లి సొసైటీకి నిర్మించిన అప్రోచ్ రోడ్డు, ప్రహరీని వారు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, కలిదిండి ఏఎంసీ చైర్మన్ కొల్లాటి సత్యనారాయణ, మాజీ చైర్మన్ పాము రవికుమార్, సొసైటీ అధ్యక్షురాలు మన్నెం రమాదేవి, కార్యదర్శి దుర్గారావు, మండల కోఆప్షన్ సభ్యుడు అల్లాభక్షు, నాని, సాయిరాం పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, సునీల్‌కుమార్ యాదవ్



అప్రోచ్ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సునీల్‌కుమార్ యాదవ్

అభివృద్ధిలో కైకలూరు ముందంజ

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ఒక్క కైకలూరు పంచాయతీలోనే వైఎస్సార్ గ్రీన్ విలేజ్‌లో మూడు వేలకుపైబడి ఇంటి స్థలాలను అందించామని, జిల్లాలోనే ప్రగతిలో కైకలూరు నియోజకవర్గం ముందు వరసలో ఉందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. గుడ్ మార్నింగ్ కైకలూరు కార్యక్రమం శనివారంతో 8వ రోజుకు చేరింది. స్థానిక 5వ సచివాలయ పరిధి 8వ వార్డులోని ఇంటింటికీ ఎమ్మెల్యే వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. పంచాయతీ కుళాయిపైపు పగలడం వల్ల నీరు వృథాగా పోతుందని పి.సత్యనారాయణ చెప్పడంతో వెంటనే బాగు చేయాలని పంచాయతీ సిబ్బందిని ఎమ్మెల్యే ఆదేశించారు. తన ఇంటికి మరుగుదొడ్డ లేదని ఒక మహిళ చెప్పడంతో మండల పరిషత్ నుంచి మరుగుదొడ్డికి అవకాశం కల్పించాలని ఎంపీపీ అడవి కృష్ణకు సూచించారు. రైతుబజారు దుకాణదారులతో ముచ్చటించారు. కార్యక్రమంలో సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఏలూరు జిల్లా వైఎస్సార్ సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ రఫీ, నాయకులు బుర్ల సత్యనారాయణ, ఫిర్దోస్ ఖాన్, కొండరాజు, ఏసుకుమార్, మోహనరావు, జయమంగళ కాసులు, గాలిబ్‌బాబు, అంజి, నాగు, రమేష్, నారాయణ, లాజరు, శంకరరావు పాల్గొన్నారు.



'గుడ్ మార్నింగ్ కైకలూరు'లో ఎమ్మెల్యే డీఎన్నార్ వెంట నడుస్తున్న అభిమానులు

శ్మశానవాటికల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిన కలెక్టర్

తోట్లవల్లూరు: కృష్ణాజిల్లాలో 50 ఎస్సీవాడల్లో శ్మశానవాటికల ఏర్పాటు కోసం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్‌కు కలెక్టర్ పి.రాజాబాబు ప్రతిపాదనలు పంపినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్‌గౌడ్ శనివారం తెలిపారు. మండలంలోని కుమ్మమూరు ఎస్సీవాడకు శ్మశానవాటిక మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డికి గత ఏడాది జూలైలో ఫిర్యాదు చేశారు. దీనికి సంబంధించి జిల్లాల్లో 50 ఎస్సీవాడల్లో శ్మశానవాటికల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు లోకాయుక్తకు కలెక్టర్ రాజాబాబు నివేదించారని పేర్కొన్నారు. వీటిలో పామర్రు నియోజకవర్గంలోనే 21 శ్మశానవాటికలు ఉన్నట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చొరవతోనే శ్మశానవాటికల ఏర్పాటుకు కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఆయన పేర్కొన్నారు.

సోదరభావంతో మెలగాలి

పామర్రు: గ్రామాల్లో అందరూ ఐకమత్యంతో సోదర భావంతో మెలగాలని పామర్రు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి.సుభాకర్ పేర్కొన్నారు. పామర్రు మండలంలోని సమస్యాత్మక అతిసమస్యాత్మక గ్రామాలలో శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనుమూరు, బల్లిపర్రు, చాట్లవానిపురం తదితర గ్రామాలలో సైనిక కవాతును నిర్వహించామన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా రాజకీయ పార్టీల నేతలు కార్యకర్తలు సమన్వయంతో వ్యవహరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ నిఘా కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జానపద సమ్మేళనం

గుడివాడ టౌన్: సంస్కృత భారతి ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణాజిల్లా జానపద సమ్మేళనం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సత్యనారాయణపురంలోని ఉపద్రష్ట వెంకటశాస్త్రి బ్రాహ్మణ సత్రంలో ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ బాలకేంద్ర ప్రముఖులు ఉపద్రష్ట అరుణశ్రీ ఈ సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. పూర్తి వివరాలకు 94400 34796ను సంప్రదించాలని కోరారు.

వదర్లపాడులో పోలీసు కవాతు

కైకలూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కైకలూరు మండలం వదర్లపాడు గ్రామంలో రూరల్ ఎస్సై టి.రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం పోలీసు హారన్ మోగిస్తూ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రశాంత ఎన్నికలకు గ్రామస్తులంతా సహకరించాలని కోరారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

బావపై మరదలు ఫిర్యాదు

కైకలూరు: తనపై అకారణంగా దాడి చేయడంతో తన దుస్తులు చిరిగాయని మరదలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బావపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు శనివారం తెలిపారు. పల్లెవాడ గ్రామానికి చెందిన డ్వాక్రా సంఘ లీడరు కంటిపాక లక్ష్మి తన ఇంటి వద్ద డ్వాక్రా సంఘ సమావేశం జరిగింది. సమావేశం ముగిసిన తర్వాత తన భర్త సోదరుడు కంటిపాక ఏసు తన భార్య డ్వాక్రా రుణం చెల్లించలేదని తప్పుగా మాట్లాడి గొడవపడ్డాడు. ఏసు తన భార్య గురించి మాట్లాడలేదని చెప్పినా వినకుండా లక్ష్మిపై దాడి చేశాడు. దీంతో లక్ష్మి రూరల్ పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదుతో ఏసుపై కేసు నమోదు చేశారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తాం

మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణి

గుడివాడరూరల్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు పేద ప్రజలకు ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను అర్థమయ్యే విధంగా వివరిస్తామని గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణివిక్టర్ పేర్కొన్నారు. మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ ఆధ్వర్యంలో మేము సిద్ధం–మా బూత్ సిద్ధం కార్యక్రమంలో దొండపాడు, మోటూరు, చౌటపల్లి గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను సచివాలయం పరిధిలోని ఇంటింటికీ వెళ్లి వివరించే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఏఎంసీ చైర్‌పర్సన్, ఎంపీపీ గద్దే పుష్పరాణి మూడు గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకొచ్చేందుకు తమవంతు పార్టీని గ్రామాల్లో బలోపేతం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు పార్టీలతో సంబంధం లేకుండా అర్హులందరికీ అమలు చేసిన విధానం, చేపట్టిన అభివృద్ధి పనులను వివరించామన్నారు. తాము చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల లబ్ధిచేకూరితే రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకుడు గద్దే వెంకటరామాంజనేయులు, మాజీ సర్పంచ్ గుదే రవిబాబు పాల్గొన్నారు.



చౌటపల్లిలో సంక్షేమ పథకాలను వివరించి కరపత్రాలు అందజేస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్, ఎంపీపీలు

ఆది దంపతుల గ్రామోత్సవం

పామర్రు: మహా శివరాత్రి పురస్కరించుకుని ఆది దంపతులైన శివ పార్వతులకు శనివారం ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. శివ రాత్రి సందర్భంగా శుక్రవారం రాత్రి శివ పార్వతుల కల్యాణం వైభ వంగా నిర్వహించారు. అనంతరం నూతన దంపతులైన స్వామి వార్లను శనివారం ఉదయం గ్రా మంలో మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

ఘనంగా చెన్నమల్లికార్జునుడి కల్యాణం

తోట్లవల్లూరు: శివరాత్రిని పురస్కరించుకుని స్థానిక శివాలయంలో శ్రీభ్రమరాంబ చెన్నమల్లికార్జునస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఆలయ వ్యవస్థాపక ట్రస్టీల తోపాటు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: స్థానిక భీమేశ్వర స్వామి వారి దేవస్థానం(పెద్దశివాలయం)లో స్వామి వారి కల్యాణం వైభవంగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణం జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ చందరాల హరిరాంబాబు పాల్గొన్నారు.

అలరించిన భరతనాట్యం

మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక బంటుమిల్లి రోడ్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానంలో శ్రీ అరుణాచలేశ్వర నాట్య నిలయం బాలికలు 25 మంది కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అర్చకులు వై. విజయభాస్కర్, రాజకుమారి, శైలజ పాల్గొన్నారు.



తోట్లవల్లూరులో చెన్నమల్లికార్జునుడి కల్యాణోత్సవం



గుడివాడలో స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



నృత్యప్రదర్శనలో పాల్గొన్న బాలికలు

పలు అభివృద్ధి పనులు ప్రారంభం

మండవల్లి: మండలంలోని కానుకొల్లులో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, రూ.10 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీహాల్‌ను శనివారం ప్రారంభించారు. అనంతరం గ్రామంలో వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా 130 రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు అందించారు. ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించి, సుస్థిర అభివృద్ధి చెందేలా చేస్తున్న సీఎం జగన్‌ను అందరూ ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చేబోయిన వీర్రాజు, సర్పంచ్ నాగదాసి థామస్, ఎంపీటీసీ సభ్యురాలు మీనాకుమారి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ అగస్టీ ఆదివిష్ణు, నాయకులు మల్లికార్జునరావు, సురేష్, జిల్లా వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, ఎంపీటీసీ నాయనబాబు, సొసైటీ మాజీ అధ్యక్షుడు గోకర్ణ, సత్యనారాయణ, యశోధనరావు, బి.వరప్రసాద్, వి.శ్రీనివాసరావు, కుమారస్వామి, పి.రాజు, పి.డేవిడ్‌రాజు, ఆర్ శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.



కానుకొల్లులో కమ్యూనిటీ హాల్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి

సంక్షేమ సారథికే పట్టం కట్టాలి

ముదినేపల్లి రూరల్ : నవరత్నాల పేరుతో అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న జగనన్నకే రాబోయే ఎన్నికల్లో తిరిగి పట్టం కట్టాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఏలూరు లోక్‌సభ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్ కోరారు. ప్రజా ఆశీర్వాదయాత్ర పేరుతో మండలంలోని చిగురుకోట, చినకామనపూడి, పెదకామనపూడి, అల్లూరు గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్రవర్ణాల పేదలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తున్న ఏకైక వ్యక్తి జగనన్న మాత్రమేనని చెప్పారు. ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, సునీల్‌కుమార్ యాదవ్ ప్రారంభించారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, ఎంపీటీసీ సభ్యులు పేరం నాగలక్ష్మి, రెడ్డి సతీష్ బాబు, సర్పంచ్‌లు చిట్టూరి వెంకట సత్యనాంచారయ్య, శీలం రామకృష్ణ పాల్గొన్నారు.



ప్రజా ఆశీర్వాద యాత్రలో పాల్గొన్న నాయకులు

12న మచిలీపట్నంలో మినీ జాబ్‌మేళా

మచిలీపట్నం టౌన్: జిల్లా ఉపాధి కల్పన శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ మంగళవారం మచిలీపట్నంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవరపల్లి విక్టర్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు ప్రైవేటు సంస్థల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాకు హాజరై నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్నారు. జిల్లాకు చెందిన పదవ తరగతి, ఐటీఐ, డిప్లొమా ఇన్ మెకానిక్స్ లేదా ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉన్న నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాకు హాజరుకావచ్చునని ఆయన తెలిపారు. బయోడేటా, ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు నకళ్లతో ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల వరకూ జీతం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 8142416211 నంబరును సంప్రదించాలన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామికి కిరీటాలు బహూకరణ

నాగాయలంక: స్థానిక కృష్ణానది తీరంలోని శ్రీవిశ్వేశ్వరస్వామి సహిత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలోని స్వామికి, అమ్మవార్లకు శనివారం దాతలు కిరీటాలు బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన మానేపల్లి సత్యనారాయణ, వరకుమారి దంపతులు రాగిపై బంగారం తాపడం చేసిన రెండు కిరీటాలు, వడ్డాణం ధర్మకర్త భవిరి సుధాకర్, అర్చకుడు మహేశ్వరపు శ్రీనివాస్ గాంధీకి అందజేశారు. కిరీట దాతలను, వాటిని తయారు చేసిన శిల్పి దేవు మయాచార్యులు(తెనాలి)ని ఆలయ యాజమాన్యం, శ్రీవీరబ్రహ్మేంద్ర ప్రచార పరిషత్ అధ్యక్షుడు భవిరి రవి ఘనంగా సత్కరించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం

ఘంటసాల: మండల కేంద్రమైన ఘంటసాలలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీబాలపార్వతీ సమేత జలధీశ్వర స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. శుక్రవారం అర్ధరాత్రి 12.02 గంటలకు మహాశివరాత్రి సందర్భంగా లింగోద్భవ కాలములో జలధీశ్వరస్వామి వారికి మహన్యాసపూర్వకంగా ఏకాదశ రుద్రాభిషేకం అర్చకుడు కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఘనంగా తెప్పోత్సవం



గోకర్ణపురం తెప్పోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ జయమంగళ దంపతులు

కైకలూరు: మహాశివరాత్రి సందర్భంగా కైకలూరు మండలం గోకర్ణపురం గ్రామంలో గోకర్ణేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ సమీపం చెరువులో స్వామి తెప్పోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, సుజాత దంపతులు హాజరయ్యారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు ఏర్పాట్లు చేశారు. కొల్లేరు పెద్దలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కృత్తివెన్ను: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కృత్తివెన్ను శివాలయం వద్ద శుక్రవారం రాత్రి శ్రీ దుర్గాపార్వతీసమేత నాగేశ్వరస్వామి, శ్రీ రమాసహిత వీరవెంకటసత్యనారాయణస్వామివార్ల దివ్య కల్యాణమహోత్సవం ఎంతో వైభవంగా జరిగింది. వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణ తంతు నిర్వహించగా వందలాది మంది భక్తులు వీక్షించారు. ఒకే వేదికమీద శివకేశవులకు కల్యాణం జరపడం ఎంతో అరుదైన విషయమని కృత్తివెన్నులో ఈ విధంగా జరపడం తమ అదృష్టమని పండితులు వివరించారు.